సాక్షి
బాపట్ల
శనివారం । 12 । ఆగస్టు । 2023



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శుక్రవారం 4,514 క్యూసెక్కులు విడుదల చేశారు.



శ్రావణమాసం సారె

చేబ్రోలు: నిత్యానంద ఆశ్రమంలోని కన్యకాపరమేశ్వరి, శారదాదేవి అమ్మవార్లకు శుక్రవారం శ్రావణమాసం సారెను మహిళలు సమర్పించారు. సారెను ఊరేగింపుగా తీసుకొచ్చారు.



దుర్గమ్మ దర్శనం

విజయవాడ : దేవదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ శుక్రవారం ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు స్వాగతం పలికారు.

న్యూస్‌రీల్

స్పందన కార్యక్రమం రద్దు

నరసరావుపేట: పల్నాడు కలెక్టరేట్‌లో ఈనెల 14వ తేదీ సోమవారం నిర్వహించే జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమాన్ని రద్దు చేశారు. 15న స్వాతంత్ర్య దినోత్సవం నేపథ్యంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు కలెక్టర్ ఎల్.శివ శంకర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

డీబీటీ లబ్ధిదారులకు ఈకేవైసీ తప్పనిసరి



నరసరావుపేట: డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) విధానంలో బ్యాంకు ఖాతాల్లో నగదు జమవుతున్న సంక్షేమ పథకాల లబ్ధిదారులు విధిగా ఈకేవైసీ చేయించుకోవాలని బీసీ కార్పొరేషన్ ఎండీ కిషోర్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం వివిధ సంక్షేమ అధికారులతో బీసీ వెల్ఫేర్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. అమ్మఒడి, చేయూత, చేదోడు, కాపు నేస్తం, ఈబీసీ నేస్తం, విద్యాదీవెన, వసతి దీవెన తదితర పథకాలు పొందుతున్న లబ్ధిదారులతో తప్పకుండా ఈకేవైసీ చేయించాలన్నారు. డీబీటీ స్కీం వెల్ఫేర్ అసిస్టెంట్లు వారికి సహాయ సహకారాలు అందించాలని సూచించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ల ఈడీలు, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్, డీజేబుల్ ఈడీ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి జూడో పోటీలకు అద్దంకి విద్యార్థులు




అద్దంకి: రాష్ట్ర స్థాయి జూడో పోటీలకు పట్టణానికి చెందిన విద్యార్థులు ఎంపికైనట్లు జూడో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డీవీ రత్నం చెప్పారు. ఈపోటీలు ఈనెల 12 నుంచి 15వ తేదీ వరకు నెల్లూరులో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పోటీలకు అద్దంకిలో శుక్రవారం నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచిన బీ శ్వేతారెడ్డి, ఎల్ హస్మిత, ఎస్ నాగూర్‌బీ, కే సెరాఅంజలి, ఏ లక్ష్మిప్రసన్న, కే అనూషా, ఎస్‌కే షబానా, ఎస్ అను, జీ రాజేశ్వరి, వీరు, బల్లికురవ కేజీబీవీ విద్యార్థులు జీ ఇజ్రాయేల్, డీవీపీ అంజిరెడ్డి ఎంపికైనట్లు చెప్పారు. స్థానిక గీతా మందిరంలో నిర్వహించిన కార్యక్రమానికి పి.రాంబాబు, చిన్ని మురళి, వెంకటకృష్ణారెడ్డి, ఎల్.అమరనాథ్, శ్యామ్ ప్రసాద్ హాజరయ్యారు.

మత్తు పదార్థ తయారీదారు అరెస్టు


గుంటూరు రూరల్: ఒక అపార్ట్‌మెంట్‌లో నిషేధిత మత్తు పదార్థాలను తయారు చేస్తున్న వ్యక్తిని నల్లపాడు పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. సీఐ శ్రీనివాసరావు కథనం ప్రకారం శ్రీనివాసరావుపేటకు చెందిన వాసేపల్లి రామకృష్ణారెడ్డి, హైదరాబాద్‌లో నివాసం ఉండే అతని మేనల్లుడు శ్రీనివాస్‌రెడ్డి ఇద్దరూ కలిసి లిక్విడ్ గంజాయిని మరగబెట్టి మెర్ట్ అనే మత్తుపదార్థం తయారు చేసి విక్రయిస్తే ఎక్కువ డబ్బులు వస్తాయని తెలుసుకున్నారు. లిక్విడ్ గంజాయిని సేకరించి మెర్ట్ తయారీకి మహాలక్ష్మి బార్ ఎదురు సందులో ప్రకాష్ అపార్ట్‌మెంట్‌లో ఒక ఫ్లాట్ అద్దెకు తీసుకున్నారు. అందులో గుట్టుచప్పుడు కాకుండా మెర్ట్ తయారు చేస్తున్నారు. సమాచారం తెలుసుకున్న నల్లపాడు పోలీసులు రెక్కీ నిర్వహించి రామకృష్ణారెడ్డిని అదుపులోకి తీసుకుని అతని వద్ద కొద్ది మొత్తంలో నిషేధిత మత్తు పదార్థాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 516.60 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 450 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 864.70 అడుగుల వద్ద ఉంది.

నిమ్మకాయల ధరలు



తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో శుక్రవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.1,400, గరిష్ట ధర రూ.2,800, మోడల్ ధర రూ.1,900 వరకు పలికింది.

సీసీఆర్ కార్డులలో.. అద్వితీయం

కౌలు రైతుకు ప్రభుత్వం అండగా ఉంది.. సీసీఆర్ కార్డులతో భరోసా ఇచ్చింది.. గతంలో వీరికి ఎలాంటి హక్కులు ఉండేవి కాదు. కౌలు నుంచి పెట్టుబడి వరకు నష్టపోయిన పరిహారం ఇవ్వడం సాధ్యం కాదనేవారు.. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు నష్టపోయిన పంటకు నష్టపరిహారం వెసులుబాటు కలిగింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధతో అర్హులందరికీ కార్డులు ఇచ్చే విధంగా చర్యలు చేపట్టారు. దీంతో బాపట్ల జిల్లా కార్డుల జారీలో రాష్ట్రంలోనే రెండో స్థానం దక్కించుకుంది.



కౌలు రైతుకు హక్కు పత్రం అందజేస్తున్న వ్యవసాయాధికారులు

- అర్హులందరికీ సీసీఆర్ కార్డులు
- లక్ష్యానికి మించి మంజూరు
- రాష్ట్రంలో జిల్లాకు రెండో స్థానం
- కౌలు దారులకు పంట రుణాలు అందించేందుకు కసరత్తు

సాక్షి ప్రతినిధి, బాపట్ల: కౌలు రైతుల సీసీఆర్ కార్డులతో మేలు జరిగింది. పెట్టుబడి సాయంతో పాటు ఆర్బీకేలతో రైతులకు అందే సాయం అందుతోంది. రక్షణకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చర్యలు చేపట్టారు. రైతుల హక్కులు కాపాడడంతో వీరికి ఆపద సమయంలో సాయం అందించేందుకు తొలుత కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందిస్తున్నారు. కార్డులను బాపట్ల జిల్లాలో విస్తృతంగా అందించారు.

కార్డులు పంపిణీలో ఘనత	
2022-23 సీజన్‌లో	36,343
2023-24 సీజన్‌లో	85,561

జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీధర్ చొరవతో అటు రెవెన్యూ, వ్యవసాయాధికారులు మరింత శ్రద్ధపెట్టి 85,651 కౌలు రైతులకు పత్రాలు అందించి రాష్ట్రంలోనే రెండో స్థానం సాధించారు.

జేసీ చొరవతో రికార్డు స్థాయిలో పత్రాలు..

కౌలుదారులకు జిల్లాలో రికార్డుస్థాయిలో హక్కుపత్రాలను అధికారులు అందజేశారు. వాస్తవానికి ఈ ఏడాది లక్ష్యం 69,241 పత్రాలు. అయినా

కార్డులతో లబ్ధి ఇలా..

ప్రభుత్వం కౌలుదారులకు హక్కు పత్రాలు మంజూరు చేయడంతో వారికి పలు రకాల లబ్ధి చేకూరనుంది. బ్యాంకులు పంట, ఇతర రుణాలు ఇస్తాయి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు రూ.13,500 రైతుభరోసా అందుతుంది.

పండించిన పంటను ప్రభుత్వం ఇచ్చే మద్దతు ధరకు అమ్ముకోవచ్చు. ప్రకృతి వైపరీత్యాల వలన పంటకు నష్టం జరిగితే ఇన్‌పుట్ సబ్సిడీ లభిస్తుంది. పంట నష్టం జరిగితే క్రాప్ ఇన్సూరెన్స్ లభిస్తుంది.

85, 561 మందికి కార్డులు

వ్యవసాయరంగానికి మరింత ప్రోత్సాహం అందించే లక్ష్యంతో జిల్లాలో కౌలురైతులకు ప్రభుత్వం పంట సాగు హక్కుదారుల పత్రాలను అందజేసింది. ఈ ఏడాది లక్ష్యం 69,241 పత్రాలు కాగా ఇప్పటి వరకూ 85,561 కార్డులు పంపిణీ చేశారు. రాష్ట్రంలో తూర్పుగోదావరి జిల్లా తరువాత అత్యధికంగా కౌలు పత్రాలు మంజూరు చేసిన జిల్లాగా బాపట్ల జిల్లా రెండో స్థానం దక్కించుకుంది. జిల్లాలో రెవెన్యూ, వ్యవసాయ శాఖలు కలసి కౌలుదారు కార్డులు అందజేశాయి. జిల్లాలో నగరం మండలంలో అత్యధికంగా 6,538 కార్డులు ఇవ్వగా ఆ తరువాత కొల్లూరు, వేమూరు, బాపట్ల, అమృతలూరు, చుండూరు మండలాల్లో మండలానికి ఐదు వేలకు పైగా కార్డులు అందజేశారు. మూడు మండలాల్లో మండలానికి నాలుగు వేల మందికి, మూడు మండలాల్లో మండలానికి మూడు వేల మందికి చొప్పున కార్డులు మంజూరు చేశారు. పది మండలాల పరిధిలో ఒక మండలంలో రెండు వేల మందికి పత్రాలు అందజేయగా మూడు మండలాల్లో ఒక్కోమండలంలో వెయ్యి మంది కౌలుదారులకు కార్డులు అందజేశారు.

కౌలుదారులకు మేలు



జిల్లాలో కౌలుదారులకు రికార్డు స్థాయిలో 85,651 హక్కు పత్రాలను అందించాం. దీంతో రాష్ట్రంలో అత్యధిక పత్రాలు అందించిన రెండో జిల్లాగా పేరొచ్చింది. కౌలుదారులకు బ్యాంకు రుణాలు ఇప్పించేందుకు కృషి చేస్తున్నాం. సీసీఆర్ కార్డులతో కౌలు రైతులకు అన్ని ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయి. పంటను మద్దతు ధరకు ఇబ్బందులు లేకుండా అమ్ముకోవచ్చు. ఏదైనా నష్టం జరిగితే ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా అందుతాయి.

– సి.శ్రీధర్,
జాయింట్ కలెక్టర్, బాపట్ల జిల్లా

అర్హులకు హక్కు పత్రాలు



జిల్లాలో కౌలు రైతులందరికీ ప్రభుత్వం సీసీఆర్ కార్డులు అందిస్తోంది. జాయింట్ కలెక్టర్ చొరవతో బాపట్ల జిల్లాలో అత్యధికంగా 85,561 కార్డులు అందజేశాం. ఈ కార్డుల వల్ల కౌలుదారులకు అన్నిరకాల మేలు జరుగుతుంది. పంటను మద్దతు ధరకు అమ్ముకోవచ్చు. మిగిలిన రైతుల మాదిరి అన్ని పథకాలు వర్తిస్తాయి. పంట దెబ్బతింటే ఇన్‌పుట్ సబ్సిడీ, క్రాప్ బీమా లభిస్తాయి.

– అబ్దుల్ సత్తార్,
జిల్లా వ్యవసాయాధికారి, బాపట్ల

ప్రభుత్వానికి రుణపడి ఉంటా



పదేళ్ల నుంచి వ్యవసాయం చేస్తున్నా. గతంలో కౌలు రైతుల కార్డులు మంజూరు చేసిన దాఖలాలు లేవు. మాలాంటి సన్న, చిన్నకారు రైతులను దృష్టిలో పెట్టుకున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతులతో పాటు మాకు కార్డులు మంజూరు చేశారు. నేను రెండు ఎకరాలు సాగు చేస్తున్నా. నాకు ప్రస్తుతం కౌలు రైతు కార్డు ఉంది. పథకాలు వర్తిస్తున్నాయి. ఈ కార్డు ద్వారా ధాన్యం కొనుగోలు, సబ్సిడీ ఎరువులు అందజేయటం హర్షనీయం.

– చేగూడి స్టీఫెన్ జాన్,
కౌలు రైతు, చింతావారిపాలెం

అందుబాటులో రెండు లక్షల టన్నుల ఎరువులు

జిల్లా సహకార శాఖ అధికారి రామారావు



ఎరువుల అమ్మకాలు ప్రారంభిస్తున్న డీసీఓ రామారావు

కారంచేడు: జిల్లాలో ఈ ఏడాది రెండు లక్షల మెట్రిక్ టన్నుల ఎరువుల అమ్మకాలే లక్ష్యంగా పనిచేస్తున్నామని బాపట్ల జిల్లా సహకార శాఖ అధికారి(డీసీఓ) కేవీ రామారావు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మండల కేంద్రం కారంచేడు చినవంతెన సెంటర్‌లో ఏర్పాటు చేసిన సహకారశాఖ సొసైటీ గోదాం ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అందులో లక్ష వ్యాపారుల ద్వారా, మరో లక్ష టన్నుల్లో 51 వేల మెట్రిక్ టన్నులు ఆర్బీకేల ద్వారా, 49 వేల టన్నుల ఎరువులను సొసైటీల ద్వారా అమ్మకాలు చేయనున్నట్లు వివరించారు. జిల్లాలోని 112 సొసైటీలు పనిచేస్తున్నాయని వీటిలో 55 సంఘాల ద్వారా, 70 సొసైటీల ద్వారా గోదాములు ఉన్నాయని చెప్పారు. మరో 54 గోదాములు 500 టన్నుల సామర్థ్యంతో కట్టుబడిలో ఉన్నాయని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ అన్నదాతల సంక్షేమం కోసం ప్రవేశపెడుతున్న అనేక రకాల సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గతేడాది కారంచేడు సొసైటీ ద్వారా శనగలు, ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో పర్చూరు ఏడీఏ ఎస్.మోహన్‌రావు, కుంభా రాఘవయ్య, ఏఓ సుధీర్‌బాబు, సొసైటీ అధ్యక్షుడు పులి నాగరాజు, బ్యాంక్ మేనేజర్ సురేష్, యార్లగడ్డ శ్రీకాంత్, స్వర్ణ శ్రీనివాసరావు, యార్లగడ్డ పాపారావు పాల్గొన్నారు.

మహిళా సాధికారతకే సున్నా వడ్డీ

- జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా
- జిల్లాలో సంఘాలకు రూ.48.80 కోట్ల జమ
- పొదుపు సంఘాలకు నమూనా చెక్కు అందజేత



వైఎస్సార్ సున్నా వడ్డీ నమూనా చెక్కు అందిస్తున్న జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా, జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, ఎమ్మెల్సీ డాక్టరు ఉమ్మారెడ్డి, ఎమ్మెల్యే కోన

బాపట్ల: మహిళా సాధికారత కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రభుత్వం సమర్థంగా అమలు చేస్తోందని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. వైఎస్సార్ సున్నా వడ్డీ నాలుగో విడత పంపిణీ కార్యక్రమం స్థానిక కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి ప్రారంభించిన కార్యక్రమాన్ని తిలకించేలా జిల్లాలో ఏర్పాట్లు చేశారు. జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా మాట్లాడుతూ ఆర్థిక, సామాజిక రంగాలలో మహిళలు అభివృద్ధి చెందడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని మహిళలు ముందుకు సాగాలని కోరారు. జిల్లాలోని మహిళలు అభివృద్ధి వైపు అడుగులు వేయాలని ఆకాంక్షించారు. జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలకు చెందిన 3,24,617 మంది పొదుపు మహిళలకు రూ.42.74 కోట్లను ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. పట్టణ ప్రాంతాలలోని 35,122 మందికి రూ.6.06 కోట్లను ప్రభుత్వం పంపిణీ చేసిందన్నారు. గడిచిన మూడు విడతలతో కలుపుకొని బాపట్ల జిల్లాలో మొత్తం రూ.184.78 కోట్లు ప్రభుత్వం విడుదల చేసిందని వివరించారు. మహిళల అభ్యున్నతి కోసం వైఎస్సార్ సున్నా వడ్డీ పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. తదుపరి జిల్లాలోని లబ్ధిదారులైన పొదుపు మహిళలకు రూ.48.80 కోట్ల జమ నమూనా చెక్కును పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, శాసన మండలిలో చీఫ్ విప్ డాక్టర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, బాపట్ల శాసనసభ్యులు కోన రఘుపతి, డీఆర్డీఏ పీడీ బి.అర్జునరావు, ఎల్‌డీఎం కృష్ణ నాయక్, డీఆర్డీఏ డీపీఎం లక్ష్మణాచారి పాల్గొన్నారు.

త్వరలో నెల్లూరు జోన్‌కు 400 కొత్త బస్సులు

- ప్రయాణికుల భద్రతకే ప్రాధాన్యం
- నెల్లూరు జోన్ ఈడీ ఆదాం సాహెబ్



బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న ఈడీ ఆదాం సాహెబ్

చీరాల అర్బన్: ఆర్టీసీ నెల్లూరు జోన్‌కు త్వరలో 400 కొత్త బస్సులు రానున్నాయని నెల్లూరు జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆదాం సాహెబ్ అన్నారు. శుక్రవారం చీరాల ఆర్టీసీ డిపోను ఆయన పరిశీలించారు. చీరాల నుంచి ఒంగోలుకు ఏర్పాటు చేసిన రెండు హైయర్ బైపాస్ రైడర్లను ప్రారంభించి, బస్సులో కొంత దూరం ప్రయాణించారు. అనంతరం బస్టాండ్‌లోని పరిసరాలను పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం చీరాల నుంచి ఒంగోలుకు ఎనిమిది బైపాస్ రైడర్లు నడుపుతున్నామని, మరో రెండు నూతనంగా ఏర్పాటు చేసినట్లు వివరించారు. చీరాల నుంచి ఒంగోలు వెళ్లే వారికి బైపాస్ రైడర్లు ఎంతో ఉపయోగపడుతున్నాయన్నారు. నెల్లూరు జోన్‌లో నూతనంగా 188 హైర్ బస్సులను తీసుకున్నామన్నారు. 140 డీలక్స్, సూపర్ లగ్జరీ పాత బస్సులను ఆధునికీకరించినట్లు చెప్పారు. కార్పొరేషన్‌కు 1500 బస్సులు రానున్నాయని, అవి టెండర్ దశలో ఉన్నాయన్నారు. డిసెంబర్, జనవరి నాటికి అందుబాటులో వస్తే జోన్‌కు 400 బస్సులు వస్తాయన్నారు. బస్సుల కండీషన్‌ను ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నామని చెప్పారు. అలానే డ్రైవర్లకు శిక్షణ అందిస్తూ సురక్షితమైన ప్రయాణానికి అవసరమైన సూచనలు చేస్తున్నామని పేర్కొన్నారు. ఆర్టీసీలో ప్రయాణం సురక్షితమైనదని, ఆర్టీసీని అందరూ ఆదరించాలని ఆయన కోరారు. ఆయన వెంట బాపట్ల జిల్లా డీపీటీఓ వై.విజయకుమార్‌రెడ్డి, డిపో మేనేజర్ జె.శ్యామల ఉన్నారు.

రైల్వే నిర్మాణాలు చేపట్టాలి

కేంద్ర రైల్వే మంత్రికి ఎంపీ అయోధ్యరామిరెడ్డి వినతి

పాత గుంటూరు: ఆంధ్రప్రదేశ్‌లో రైల్వే శాఖ ఆధ్వర్యంలో చేపట్టాల్సిన పనులను త్వరగా ప్రారంభించాలని రాజ్యసభ ఎంపీ ఆళ్ల అయోధ్యరామిరెడ్డి కోరారు. శుక్రవారం ఢిల్లీలో కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ని ఎంపీ కలిసి రాష్ట్రంలోని పలు ప్రతిపాదనల గురించి వివరించారు. గుంటూరు–సికింద్రాబాద్ రైలుకు 'అనవేమ ఎక్స్‌ప్రెస్' పేరు పెట్టాలని కోరారు. గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్, మంగళగిరి, పొన్నూరు, తెనాలి, జగ్గయ్యపేట, విజయవాడ సెంట్రల్ అసెంబ్లీ నియోజకవర్గాలలో రైల్వే క్రాసింగ్‌ల వద్ద కొన్ని ఆర్వోబీలు, ఆర్‌యూబీలు నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. గుంటూరు బ్రాడీపేట్ ఫ్లై ఓవర్‌ను 1957లో రెండు లైన్ల వెడల్పుతో నిర్మించారని, ఆ స్థానంలో కొత్త రైల్వే ఓవర్ బ్రిడ్జిని 6 లైన్ల వెడల్పుతో పునర్నిర్మించాలని విన్నవించారు. మహాత్మాగాంధీ ఇన్నర్ రింగ్ రోడ్ వద్ద కొత్త రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని ప్రతిపాదించారు. దుగ్గిరాల, తాడేపల్లి, మంగళగిరి పరిధిలో కొత్త ఆర్వోబీలను నిర్మించాలని కోరారు. పొన్నూరు అసెంబ్లీ నియోజకవర్గంలోని పెదకాకాని గ్రామంలో ఆర్వోబీ నిర్మించాలని విజ్ఞప్తిచేశారు. తెనాలి–వైకుంఠపురం ఆర్వోబీని,చినరావూరు వద్ద రైల్వే గేటును పునరుద్ధరించాలని విన్నవించారు. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలోని విజయవాడ–హౌరా లైన్ విజయవాడ–సికింద్రాబాద్ లైన్ల మధ్య ట్రాఫిక్ అంతరాయానికి అధికారులు పరిష్కారం చూపించాలని కోరారు.

దళితుల ఆరాధ్యదైవం సీఎం వైఎస్ జగన్

రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్

మాచర్ల: దళితుల సంక్షేమం కోసం నిరంతరం శ్రమిస్తూ వారి ఆరాధ్య దైవంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మారారని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ చెప్పారు. శుక్రవారం రాత్రి మాచర్ల మున్సిపల్ కార్యాలయంలో కొత్త చైర్మన్‌గా మాచర్ల చిన ఏసోబు బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆదిమూలపు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ దళితులుగా పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా అంటూ ఎస్సీలను చిన్నచూపు చూసిన వ్యక్తి చంద్రబాబు అని విమర్శించారు. చంద్రబాబు హయాంలో దళితులను దగా చేశారని ధ్వజమెత్తారు. దళిత ఉద్యమకారులపై చంద్రబాబు అనేక కేసులు పెట్టి వేధించారని గుర్తుచేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక ఆ కేసులన్నీ రద్దు చేశారని చెప్పారు. ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి(పీఆర్కే) మాట్లాడుతూ దళితులకు ప్రాధాన్యం ఇవ్వడమే ధ్యేయంగా ప్రభుత్వంతోపాటు తాను పనిచేస్తున్నట్టు వివరించారు.

లాహిరి లాహిరి 'లాంచీలో'..

- కృష్ణానదిలో లాంచీ ప్రయాణం ప్రారంభం
- రాయపూడి ఫెర్రీకి కొత్తగా రెండు లాంచీలకు అనుమతి
- మూడున్నరేళ్ల సుదీర్ఘ విరామం తరువాత నదిలో రాకపోకలు



రాయపూడి వద్ద కృష్ణానదిలో లాంచీ ప్రయాణం

రాయపూడి(తాడికొండ): కృష్ణానదిలో మూడున్నరేళ్ల సుదీర్ఘ విరామం అనంతరం ప్రభుత్వం వసతులతో కూడిన లాంచీ ప్రయాణానికి అనుమతులు మంజూరు చేసింది. పాపికొండల యాత్రకు వెళ్లిన బోటు తిరగబడడంతో అప్పట్లో రాష్ట్రంలో పడవ ప్రయాణాలను ప్రభుత్వం రద్దు చేసింది. ఫలితంగా రాయపూడి రేవు మూతపడింది. ఇన్నేళ్ల తర్వాత ఇప్పుడు రెండు లాంచీల రాకపోకలకు అనుమతి ఇవ్వడంతో లైఫ్ జాకెట్లు, ఫైర్ సేఫ్టీ సిస్టమ్, ఇతర పూర్తి వసతులతో కూడిన ప్రయాణం శుక్రవారం నుంచి ప్రారంభమైంది. రాయపూడి రేవు నుంచి కృష్ణా జిల్లాకు వెళ్లేందుకు 50 కిలోమీటర్లు దూరం తగ్గుతుండటంతో ద్విచక్రవాహనదారులూ లాంచీ ప్రయాణానికి ప్రాధాన్యం ఇస్తారు. టికెట్ ధరగా ఒకొక్కరికి రూ.50 లాంచీల నిర్వాహకులు వసూలు చేస్తున్నారు. ద్విచక్ర వాహనానికి రూ.50 వసూలు చేస్తున్నారు. లాంచీ ప్రయాణం పునరుద్ధరణతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పర్యాటకంగానూ ప్రయోజనం ఉంటుందని చెబుతున్నారు.

క్లుప్తంగా

ఉద్యోగం పేరుతో మోసం

గుంటూరు ఈస్ట్: ఆన్‌లైన్‌లో ఉద్యోగం పేరుతో ఓ యువతిని మోసం చేసిన ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. బ్రాడీపేట 6/13లోని ఓ లేడీస్ హాస్టల్‌లో నివసించే ఎ.త్రివేణి అనే యువతి ఉద్యోగం కోసం ప్రయత్నాలు చేస్తోంది. కొద్ది రోజుల క్రితం కల్యాణీవాసు అనే మహిళ ఫోన్‌లో త్రివేణిని సంప్రదించింది. వర్క్‌ఫ్రమ్ హోం ఉద్యోగం ఇచ్చి కొంత వర్క్ చేసిన తరువాత డబ్బులు పంపితే పెద్ద ఉద్యోగం ఇప్పిస్తామని ఆశ చూపింది. అది నమ్మిన త్రివేణి పలు విడతలుగా 4 లక్షలు చెల్లించింది. అనంతరం ఫోన్ నంబర్ పనిచేయలేదు. ఆన్‌లైన్‌లోనూ ఎటువంటి సమాధానం రాలేదు. తాను మోసపోయినట్లు గుర్తించిన త్రివేణి శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యార్డుకు 26,410 బస్తాల మిర్చి

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 23,882 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 26,410 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.10,500 నుంచి 23,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి 25,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.12,000 నుంచి 23,000 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.10,500 నుంచి 26,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి 14,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 9,634 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

భవిష్యత్ కోసం ప్రకృతిని కాపాడుకుందాం

ఎమ్మెల్యే కోన రఘుపతి



నా భూమి- నా దేశం కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల: భావితరాల భవిష్యత్ కోసం ప్రకృతిని కాపాడుకోవాలని ఎమ్మెల్యే కోన రఘుపతి పిలుపునిచ్చారు. శుక్రవారం బాపట్ల నియోజకవర్గ పరిధిలోని పడమర బాపట్ల గ్రామ పంచాయతీలోని యూపీ స్కూల్ వద్ద నా భూమి- నా దేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోన రఘుపతి మాట్లాడుతూ భారత్ దేశం బ్రిటీష్ పాలన నుంచి విముక్తి పొంది 75 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా గత ఏడాది ఆజాదీ కా అమృత్ మహోత్సవం కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం చేపట్టడం జరిగిందన్నారు. అదే విధంగా ఈ సంవత్సరం నా భూమి- నా దేశం కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు వివరించారు. దేశం కోసం వీరులు త్యాగాల ఫలితమే మన స్వాతంత్ర్యంగా పేర్కొన్నారు. భారత జాతి మనుగడను కాపాడడానికి అందరూ కలిసి కట్టుగా ఉండాలన్నారు. చిన్నప్పటి నుంచి పిల్లలకు మన సాంస్కృతిక సంప్రదాయాలు నేర్పాలని సూచించారు. జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా మాట్లాడుతూ భారత దేశ రక్షణ కోసం ప్రాణ త్యాగాలు చేసిన వీరులను స్మరించుకోవాలని అన్నారు. మానవ అభివృద్ధికి మొక్కలు నాటాలని కోరారు. నీరు, మొక్క ఉంటేనే మానవ మనుగడ ఉంటుందని చెప్పారు. ఈ సందర్భంగా పడమర బాపట్ల యూపీ స్కూల్ వద్ద నా భూమి- నా దేశం శిలాఫలకాన్ని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, ఎమ్మెల్యే కోన రఘుపతి ఆవిష్కరించారు. అనంతరం బాపట్ల మండలానికి చెందిన అమరవీరులు మరుప్రోలు జశ్వంత్‌రెడ్డి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి తల్లిదండ్రులను సన్మానించారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. జాతీయ జెండా వందన చేశారు. అనంతరం పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యక్రమంలో డి.ఆర్.డి.ఎ. ప్రాజెక్ట్ డైరెక్టర్ అర్జున్, డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ వై.శంకర్ నాయక్, జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు, ఎంపీడీఓ రాధాకృష్ణ పాల్గొన్నారు.

సాగునీటి ప్రాజెక్టులు నిర్మించిన ఘనత వైఎస్సార్‌దే

ఎంపీ మోపిదేవి

నగరం: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సాగునీటి ప్రాజెక్టులను నిర్మించిన ఘనత దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డిదేనని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు చెప్పారు. మండలంలోని పరిశావారిపాలెంలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతుల పక్షపాతిగా ఆనాడు వైఎస్ రాజశేఖరరెడ్డి గుండ్లకమ్మ, పులిచింతల వంటి పలు సాగునీటి ప్రాజెక్టులను పూర్తిచేసి జాతికి అంకితం చేశారన్నారు. గుండ్లకమ్మ పాజెక్టుకు ఏడుసార్లు శంకుస్థాపన చేసింది చంద్రబాబు అని ఆ ప్రాజెక్టుని మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి పూర్తి చేశారని పేర్కొన్నారు. నేడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి తగిన ప్రాధాన్యం ఇస్తున్నారని చెప్పారు. 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబునాయుడు ఒక్క సాగునీటి ప్రాజెక్టయిన పూర్తి చేసి జాతికి అంకితం చేశారా అని ప్రశ్నించారు. తన ఉనికిని కాపాడుకునేందుకు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. అధికారంలో ఉన్నప్పుడు రైతులు గుర్తురారని కార్పొరేట్ కంపెనీలు కనబడతాయన్నారు. వ్యవసాయం దండగా అని చెప్పింది చంద్రబాబేనని గుర్తుచేశారు. ప్రాజెక్టుల నిర్మాణం పేరుతో పాదయాత్ర, పొర్లుదండాలు చేసిన ప్రజలు పట్టించుకోరన్నారు. పోలవరం ప్రాజెక్టును బాతుగుడ్డులా, ఏటీఎం కార్డులా వాడుకున్నది చంద్రబాబేనని గుర్తు చేశారు. ప్రాజెక్టుల సందర్శన పేరుతో శాంతి భద్రతలకు విఘాతం కల్పిస్తున్నాడని ఇందుకు ఉదాహరణ పుంగనూరు ఘటన అని ఆరోపించారు. తర్వలోనే పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి రైతాంగానికి సాగునీరు అందించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు చేపడుతున్నారని వివరించారు. సమావేశంలో ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు మోపిదేవి రాజీవ్, ప్రసాదం వాసుదేవ పాల్గొన్నారు.

హత్యకేసులో నిందితుడి అరెస్టు



కేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐ ఫిరోజ్, ఎస్ఐ ప్రసాద్

పర్చూరు(చినగంజాం): తల్లి హత్య కేసులో కుమారుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. కేసు వివరాలను శుక్రవారం మార్టూరు సీఐ ఎస్‌కే టీ ఫిరోజ్, ఎస్ఐ ఎస్‌సీ ప్రసాద్ విలేకరుల సమావేశంలో వెల్లడించారు. పర్చూరు మండలం కొత్తపాలేనికి చెందిన మద్దిన పేరమ్మ ఈనెల 5వ తేదీ సాయంత్రం 4 గంటల సమయంలో ఇంట్లో ఉండగా ఆమె చిన్న కుమారుడు మద్దిన అంజయ్య వచ్చి ఆమె పేరు మీద ఉన్న రెండెకరాల పొలాన్ని అతడి పేరు మీద రాయమని గొడవపడ్డాడు. రాయకపోవడంతో పాటు ఆమెకు ఇవ్వాల్సిన రూ.4 లక్షల డబ్బులు ఇవ్వాల్సి వస్తుందని ఆమెను చంపాలనే ఉద్దేశంతో గొడవ పెట్టుకున్నాడు. అనంతరం కత్తితో గాయపరిచాడు.

ఈక్రమంలో ఆమె కేకలు వేయడంతో అక్కడి నుంచి అంజయ్య పారిపోయాడు. రక్తగాయాలతో ఉన్న పేరమ్మను స్థానికులు చీరాలలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆగస్టు 8న మృతి చెందింది. హత్యాయత్నం కేసును హత్య కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు. శుక్రవారం పర్చూరు వై జంక్షన్ వద్ద అంజయ్యను అరెస్టు చేసి, పర్చూరు కోర్టుకు హాజరు పరిచినట్లు తెలిపారు. నిందుతుడికి 14 రోజులు రిమాండ్ విధించారు.

పిడుగుపాటుతో మహిళ మృతి



పిడుగుపాటుతో చనిపోయిన చిన్నమ్మాయి

బల్లికురవ: పొలంలో పిడుగు పడటంతో ఓ మహిళ అక్కడికక్కడే చనిపోయింది. ఈ ఘటన శుక్రవారం సాయంత్రం బల్లికురవ మండలంలోని కొమ్మినేనివారిపాలెంలో చోటుచేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన మన్యం చిన్నమ్మాయి(54) గ్రామం నుంచి కొప్పరపాడు వెళ్లే దారిలో తనకున్న రెండెకరాల పొలంలో బీర వేసుకుని జీవనం సాగిస్తోంది. వర్షం, పిడుగుపాటుకు బీరకాయలు కోస్తుండగా చనిపోయింది. భర్త నాగేశ్వరరావు పదేళ్ల క్రితం చనిపోయాడు. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. చిన్నమ్మాయి మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో సంపూర్ణ ఆరోగ్యం

డీపీఎం వాణిశ్రీ



ప్రకృతి సాగులో ఏటీఎం విధానంపై అవగాహన కల్పిస్తున్న జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ వాణిశ్రీ

యద్దనపూడి: ఏటీఎం మెడల్ వ్యవసాయ పద్ధతుల ద్వారా ఏడాది పాటు ఆదాయం పొందవచ్చని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ వాణిశ్రీ సూచించారు. మండలంలోని పూనూరు, గన్నవరం గ్రామాల్లో ప్రకతి వ్యవసాయ సిబ్బంది, స్థానిక రైతులతో ఏటీఎం విధానం, ప్రకృతి వ్యవసాయ సాగు పద్ధతులపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ అంతర పంటల సాగు వలన ప్రధాన పంటలకు అయ్యే ఖర్చులను రాబట్టుకోవచ్చని దీనికి ఏటీఎం విధానం ఎంతో విలువైందని చెప్పారు. ప్రతి పొలంలో 20 సెంట్ల వరకు వివిధ రకాల కూరగాయలు, దుంప, తీగ జాతి ఆకుకూరలు నాటుకొని తద్వారా వచ్చే ఆదాయంతో ఆర్థికంగా నిలదొక్కుకోవచ్చన్నారు. అలాగే ఈ ప్రకృతి వ్యవసాయం విధానంలో పురుగు మందుల వినియోగం లేకపోవటంతో సంపూర్ణ ఆరోగ్యంతో కూడిన ఉత్పత్తులను తినవచ్చని వివరించారు. కార్యక్రమంలో అనంతపురం జిల్లా మోడల్ మేకర్ రమేష్‌బాబు, మండల మోడల్ మేకర్ నాగరాజు, ఎల్‌టూలు అనూష, వెంకటరత్నం, కోటిబాబు పాల్గొన్నారు.

ప్రాణాధార వర్క్‌షాపు సందర్శన



యంత్రాలను పరిశీలిస్తున్న అఖిలభారత వరి పరిశోధన సంస్థ ప్రతినిధులు

బాపట్ల: చెరువు జమ్ములపాలెంలోని ప్రాణాధార సెంట్రల్ వర్క్ షాప్‌ను అఖిల భారత వరి పరిశోధన సంస్థ(ఐఐఆర్ఆర్) శాస్త్రజ్ఞులు డాక్టర్ మహేంద్ర కుమార్, ఎంబీబీ ప్రసాద్, ఏవీఎస్ ఆర్.స్వామి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా వర్క్‌షాప్ ప్రతినిధి హేమంత్ మాట్లాడుతూ ప్రాణాధార సంస్థ పొడి నేలలో 30 సెంటీమీటర్లు ఎడం సాళ్లతో గొర్రుతో వెద పెట్టే విధానం భారతదేశంలోని ప్రాణాధార ప్రప్రథమంగా చేపట్టారని తెలిపారు. వరి పైరులో సన్న టైర్లు బిగించిన కుబోటు చిన్న ట్రాక్టర్‌తో బురద నెలలో వరి విత్తనం విత్తు విధానం, పొడి నేలలో, బురద నేలలో కలుపుతీయుట, ఎరువులు చల్లటం, మురుగు కాలువలు వేయుట, మందుల పిచికారి చేయడం, వరి సాగు సులువుగా, సుస్థిరంగా, లాభసాటిగా చేయుటకు రైతులకు చాలా ఉపయోగంగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ సంతోష్ రామాడ్, డాక్టర్ అనిల్ కుమార్, కుర్ర పుండరీకాక్షుడు, నూతలపాటి బాబు, కుర్ర సాంబశివరావు, పువ్వాడ బసంత్ కుమార్ పాల్గొన్నారు.

వెబ్ ఆప్షన్ ప్రక్రియ సహాయక కేంద్రం ప్రారంభం

రేపల్లె: పాలిటెక్నిక్‌లో వెబ్ ఆప్షన్ ప్రక్రియ సహాయ కేంద్రాన్ని ప్రారంభించినట్లు రేపల్లె ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.చంద్రశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాలిటెక్నిక్‌లో 2023–24 విద్యాసంవత్సరానికి సంబంధించి డిప్లొమాలో ప్రవేశాల కోసం ఈ నెల 11 నుంచి ప్రారంభమైన వెబ్ ఆప్షన్‌ల ప్రక్రియ 14వ తేదీ వరకు కొనసాగుతుందని చెప్పారు. పాలిసెట్ సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తయిన విద్యార్థులకు వెబ్ ఆప్షన్ నమోదు చేయటంలో సాయం అందించనున్నట్లు వివరించారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

పిట్టలవానిపాలెం: యువకుడిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. చందోలు ఎస్ఐ రాజశేఖర్ తెలిపిన వివరాలు.. మండలంలోని భవనంవారిపాలెం శివారు కొత్తరెడ్డిపాలెం గ్రామానికి చెందిన బాలిక బంధువుల ఇంటికి రాగా అదే గ్రామానికి చెందిన యువకుడు ఈనెల 10వ తేదీ రాత్రి లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. అతడిపై గతంలోనూ ఓ పోక్సో కేసు నమోదైంది.

కాపుల అభ్యున్నతికి ఎనలేని కృషి

కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు



సమావేశంలో మాట్లాడుతున్న కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు

నెహ్రూనగర్ (గుంటూరు ఈస్ట్): కాపుల అభ్యున్నతికి రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ కృషి చేస్తోందని కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు పేర్కొన్నారు. శుక్రవారం గుంటూరులో కాపు సోదరుల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో భవిష్యత్ కార్యాచరణపై సూచనలు, సలహాలు తీసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతం నుంచి అన్ని రాజకీయ పార్టీలు కూడా కాపులపై కుట్ర చేస్తున్నాయన్నారు. కానీ నేడు అలాంటి పరిస్థితులను ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి చరిత్ర తిరగరాసి కాపులకు సముచిత స్థానం కల్పిస్తున్నారన్నారు. పవన్ కల్యాణ్, చంద్రబాబుకి ఊడిగం చేస్తూ చంద్రబాబుని ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. కాపు నేస్తం ద్వారా 2 కోట్ల రూపాయలు అక్క, చెల్లెమ్మలకు ఇవ్వడం జరిగిందన్నారు. పవన్‌కు మాయమాటలు చెప్పి చంద్రబాబు వాడుకుంటున్నాడనీ, ప్రజలు ఈ విషయాన్ని గమనించాలన్నారు. వారాహి, జనసేన కార్యాలయంతోపాటు పవన్ కల్యాణ్ మాట్లాడే మాటలు కూడా అతనివి కాదన్నారు. త్వరలోనే అన్ని జిల్లాల్లోనూ కాపులతో సమావేశం ఏర్పాటు చేసి కాపులను ఏకతాటిపైకి తెచ్చి మరోసారి జగన్‌మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రి చేసే విధంగా కృషి చేస్తామని పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ కాపు సామాజిక వర్గానికి గతంలో న్యాయం చేసిన ఘనత రాజశేఖర్‌రెడ్డిది అయితే నేడు ముఖ్యమంత్రి జగనన్నకే దక్కుతుందన్నారు. నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు మాట్లాడుతూ కాపుల అభివృద్ధికి తోడ్పాటు అందించిన ముఖ్యమంత్రి జగనన్న నాయకత్వాన్ని బలపరుస్తూ రానున్న ఎన్నికల్లో కాపు సామాజిక వర్గం అంతా కూడా వైఎస్సార్ సీపీ గెలుపునకు కృషి చేసే విధంగా ప్రతి ఒక్కరు పని చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

త్వరలో భారత్ బ్లాక్ చైన్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ యాత్ర



సమావేశంలో పాల్గొన్న అతిథులు, కళాశాల ప్రతినిధులు

తాడికొండ: త్వరలో నిర్వహించే బ్లాక్ చైన్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ యాత్రకు ఆతిథ్యం ఇస్తున్న మొట్టమొదటి విశ్వవిద్యాలయం వీఐటీ–ఏపీ అని భారత్ బ్లాక్ చైన్ యాత్ర కన్వీనర్, వైస్ ప్రెసిడెంట్ ఐడీఎస్ ఓరుగంటి అరవింద్ అన్నారు. శుక్రవారం గుంటూరు జిల్లా ఐనవోలు వీఐటీ ఏపీ విశ్వవిద్యాలయంలో ఐడీఎస్ ద్వారా నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. బ్లాక్ చైన్ టెక్నాలజీ, వ్యాపార నెట్‌వర్క్‌లో పారదర్శక సమాచారం పంచుకోవడానికి వీలు కల్పించే అధునాతన భారత్ బ్లాక్ చైన్ సెంటర్ యాత్రను ఏఐసీటీఈ, విద్యామంత్రిత్వ శాఖ సహకారంతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వెబ్–3 బ్లాక్ చైన్‌కు సంబంధించిన భారతదేశపు మొట్టమొదటి సాంకేతిక యాత్ర భారత్ బ్లాక్ చైన్ యాత్ర అన్నారు. వీఐటీ ఏపీ వీసీ ఎస్‌వీ కోటారెడ్డి మాట్లాడుతూ పరిశోధనలో వీఐటీ–ఏపీ విశ్వవిద్యాలయం ఎప్పుడూ ముందుంటుందని, త్వరలో క్యాంపస్‌లో ఐడీఎస్–వీఐటీ ఏపీ బ్లాక్ చైన్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్ పూర్తిగా ఐడీఎస్ నిధులతో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఐడీఎస్ సీఈవో సుదర్శన్‌రెడ్డి, డాక్టర్ ప్రభా సెల్వరాజ్, డాక్టర్ ప్రదీప్ రెడ్డి, సునీల్ యడ్లపల్లి పాల్గొన్నారు.